# గుజరాత్ వేట షురూ

**యూపీ వారియర్స్‌పై ఘనవిజయం • ఆష్లే గార్డ్‌నర్ ఆల్‌రౌండ్ షో**



ప్రియా (3/25)

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ అదరగొట్టింది. ఆదివారం వడోదర వేదికగా యూపీ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్.. 6 వికెట్ల తేడాతో యూపీని ఓడించి మూడో సీజన్‌లో టైటిల్ వేటను షురూ చేసింది. యూపీ నిర్దేశించిన 144 పరుగుల ఛేదనను గుజరాత్.. 18 ఓవర్ల లోనే పూర్తిచేసింది. ఆ జట్టు సారథి ఆష్లే గార్డ్‌నర్ (32 బంతుల్లో 52, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) మరోసారి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. హర్లీన్ (34 నాటౌట్), డాటిన్ (33 నాటౌట్) రాణించారు. మొదట బ్యాటింగ్ చేసిన యూపీని కెప్టెన్ దీప్తి శర్మ (39), ఉమా ఛెత్రి (24) ఆదుకున్నారు. గుజరాత్ స్పిన్నర్ ప్రియా మిశ్రా (3/25) ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేసింది.

### గార్డ్‌నర్ జోరు

స్వల్ప ఛేదనే అయినా విజయం కోసం గుజరాత్ చెమటోడ్చక తప్పలేదు. స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై యూపీ స్పిన్నర్లు తొలి రెండు ఓవర్లలోనే మూనీ, హేమలతను పెవిలియన్‌కు పంపి జెయింట్స్‌పై ఒత్తిడి తెచ్చారు. అయితే లారా వోల్వార్ట్ (22)తో కలిసిన గార్డ్‌నర్.. గుజరాత్ ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చింది. క్రాంతి 3వ ఓవర్లో రెండు బౌండరీలతో వేట మొదలెట్టిన ఆమె సైమా 5వ ఓవర్లో రెండు భారీ సిక్సర్లు కొట్టింది. ఎకిల్‌స్టోన్ 9వ ఓవర్లో లారా నిష్క్రమించినా గార్డ్‌నర్ దూకుడును ఆపలేదు. 28 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన ఆమెను మెక్‌గ్రాత్ ఔట్ చేసింది. ఆష్లే నిష్క్రమించినా డాటిన్, హర్లీన్ మరో వికెట్ పడకుండా ఛేదనను పూర్తిచేశారు.



గార్డ్‌నర్ (52)

### ప్రియా మాయ

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన యూపీ 22 పరుగులకే రెండు కోల్పోయినా ఉమా, దీప్తి ఆ జట్టును ఆదుకున్నారు. ఈ ద్వయం మూడో వికెట్‌కు 51 పరుగులు జోడించడంతో ఒక దశలో యూపీ 72/2తో పటిష్టంగానే కనిపించింది. కానీ ప్రియా మాయతో ఆ జట్టు బ్యాటింగ్ లైనప్ కుదేలైంది. డాటిన్ బౌలింగ్‌లో ఉమ క్యాచ్ అందుకున్న ప్రియా.. ఆ తర్వాత దీప్తి, మెక్‌గ్రాత్, హారీస్‌ను ఔట్ చేసి యూపీని కోలుకోలేని దెబ్బతీసింది. ఆఖర్లో శ్వేత (16), అలానా (19), సైమా (15) మెరుపులతో ఆ జట్టు పోరాడగలిగే స్కోరును సాధించింది. గార్డ్‌నర్ (2/39) బౌలింగ్‌లోనూ రాణించింది.

**సంక్షిప్త స్కోర్లు:**
**యూపీ:** 20 ఓవర్లలో 143/9 (దీప్తి 39, ఉమ 24, ప్రియా 3/25, డాటిన్ 2/34); **గుజరాత్:** 18 ఓవర్లలో 144/4 (గార్డ్‌నర్ 52, హర్లీన్ 34 నాటౌట్, ఎకిల్‌స్టోన్ 2/16)

# నేటి నుంచే రంజీ సెమీస్ పోరు



నాగ్‌పూర్: దేశవాళీ ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీ 2024-25 సీజన్ ముగింపు దశకు చేరింది. సోమవారం నుంచి ఈ సీజన్‌లో సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లు మొదలుకానున్నాయి. సీజన్‌లో పడుతూ లేస్తూ సెమీస్ చేరిన డిఫెండింగ్ చాంపియన్స్ ముంబై.. కీలకపోరులో విదర్భతో తలపడనుంది. విదర్భ క్రికెట్ అసోసియేషన్ (నాగ్‌పూర్) ఈ మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వనుంది. క్వార్టర్స్‌లో హర్యానాతో తొలి ఇన్నింగ్స్‌లో తడబడ్డా లోయరార్డర్ బ్యాటర్ల సాయంతో గట్టెక్కిన ముంబై.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం దుమ్మురేపింది. కెప్టెన్ అజింక్యా రహానే, సూర్యకుమార్ యాదవ్, శార్దూల్ ఠాకూర్, శివమ్ దూబే వంటి స్టార్లు ఆ జట్టుకు అదనపు బలం. సిద్ధేశ్ లాడ్, తనూష్ కొటియాన్ ముంబై విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. విదర్భ కరుణ్ నాయర్, యశ్ రాథోడ్, కెప్టెన్ అక్షయ్ వాడ్కర్, అథర్వ తైడేపై భారీ ఆశలే పెట్టుకుంది. ఇక మరో సెమీస్ గుజరాత్, కేరళ మధ్య జరుగనుంది. అహ్మదాబాద్ వేదికగా జరుగబోయే ఈ మ్యాచ్‌లో గుజరాత్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది.



# భారత్ బోణీ

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో భారత పురుషుల జట్టు బోణీ కొట్టింది. తొలి మ్యాచ్‌లో స్పెయిన్ చేతిలో ఓడినా అదే జట్టుతో ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో మాత్రం 2-0తో ప్రత్యర్థిని చిత్తుచేసి బదులు తీర్చుకుంది. భారత్ తరఫున మన్‌ప్రీత్ సింగ్ (32ని.), దిల్‌ప్రీత్ (40ని.) రెండు గోల్స్ సాధించారు. మహిళల విభాగంలో శనివారం జరిగిన మొదటి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను ఓడించిన అమ్మాయిలు.. వారితోనే జరిగిన రెండో మ్యాచ్‌లో మాత్రం ఓడారు. నిర్ణీత సమయానికి స్కోర్లు 2-2తో సమంగా నిలవడంతో మ్యాచ్ షూటౌట్‌కు దారితీసింది. షూటౌట్‌లో ఇంగ్లండ్ 2-1తో భారత్‌ను ఓడించింది.

# మనికా ఔట్

ఢిల్లీ: ఈనెల 19 నుంచి చైనాలో జరుగబోయే టేబుల్ టెన్నిస్ ఆసియా కప్-2025లో భారత్ స్టార్ ప్యాడ్లర్ మనికా బాత్రా లేకుండానే బరిలోకి దిగనుంది. ఇటీవలే తండ్రిని కోల్పోయిన బాధలో ఉన్న మనికా.. గాయం కారణంగా ఈ టోర్నీ నుంచి వైదొలిగింది. ఆమె స్థానంలో యువ ప్యాడ్లర్ యశస్విని.. ఆకుల శ్రీజ, ఐహిక ముఖర్జీతో కలిసి మహిళల సింగిల్స్‌లో ఆడే అవకాశం దక్కించుకుంది.

## ముంబైదే ఐసీపీఎల్ ట్రోఫీ




ముంబై: ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ (ఐఎస్‌పీఎల్) రెండో సీజన్ విజేతగా మాఝి ముంబై నిలిచింది. పూణెలోని దాదోజీ కొండదేవ్ స్టేడియం వేదికగా జరిగిన ఫైనల్‌లో ముంబై.. శ్రీనగర్ కి వీర్‌ను మూడు వికెట్ల తేడాతో ఓడించింది. ఆద్యంతం ఉత్కంఠగా జరిగిన టైటిల్ పోరులో మొదట బ్యాటింగ్ చేసిన శ్రీనగర్.. నిర్ణీత 20 ఓవర్లలో 120/5 పరుగులు చేసింది. ఛేదనలో ముంబై 64 పరుగులకే 6 వికెట్లు కోల్పోయినా ఆఖర్లో ధాటిగా ఆడిన ముంబై విజేతగా నిలిచింది.

*మార్చి 22 నుంచి మొదలు*

# ఆగయా ఐపీఎల్ షెడ్యూల్

**కేకేఆర్, ఆర్సీబీ మధ్య తొలి పోరు • కోల్‌కతాలో ఆరంభ, ఆఖరి మ్యాచ్‌లు • 23న ఎస్‌ఆర్‌హెచ్ మొదటి మ్యాచ్ • హైదరాబాద్‌లో ప్లేఆఫ్స్**

**వేసవిలో క్రికెట్ మజాను అందించడానికి ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ లీగ్ సిద్ధమైంది. ఐపీఎల్ 18వ సీజన్ షెడ్యూల్ వచ్చేసింది. దేశంలోని 13 నగరాలలో ఏకంగా 65 రోజుల పాటు సుదీర్ఘంగా జరిగే ఈ క్రికెట్ పండుగకు మార్చి 22న తెరలేవనుంది. అంతర్జాతీయ క్రికెట్ స్టార్లతో కలిసి దేశవాళీ యువ సంచలనాలు మెరుపులు మెరిపించబోయే ఈ క్యాష్ రిచ్ ఈవెంట్‌లో తొలి మ్యాచ్ కేకేఆర్, ఆర్సీబీ మధ్య జరుగనుంది. ఈసారి హైదరాబాదీలకు 'డబుల్' బొనాంజా. లీగ్ మ్యాచ్‌లతో పాటు నాకౌట్ మ్యాచ్‌లకూ ఉప్పల్ స్టేడియం ఆతిథ్యమివ్వనుండటం గమనార్హం.**




ముంబై: ధనాధన్ క్రికెట్ పండుగ ఐపీఎల్-2025 షెడ్యూల్ వచ్చేసింది. కోట్లాది అభిమానుల నిరీక్షణకు తెరదించుతూ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆదివారం సాయంత్రం ఐపీఎల్-18వ సీజన్ షెడ్యూల్‌ను ప్రకటించింది. భారత క్రికెట్ మక్కా ఈడెన్ గార్డెన్ వేదికగా మార్చి 22న మొదలై రెండు నెలల పాటు అభిమానులను ఉర్రూతలూగించే ఈ మెగా టోర్నీ.. అదే మైదానంలో మే 25న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. డిఫెండింగ్ చాంపియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌తో 18వ సీజన్‌కు తెరలేవనుంది. గత సీజన్ రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్.. మార్చి 23న సొంత గ్రౌండ్ (ఉప్పల్)లో రాజస్థాన్ రాయల్స్‌తో ఆడబోయే మ్యాచ్‌తో టైటిల్ వేటను మొదలుపెట్టనుంది. కాగా లీగ్ దశలో హైదరాబాద్ వేదికగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో ఒక్కమ్యాచ్ లేకపోవడం ఇక్కడి కోహ్లీ అభిమానులకు కాస్తంత నిరాశే!

### బ్లాక్‌బస్టర్ ఓపెనింగ్

సీజన్ ఆరంభమే బ్లాక్‌బస్టర్ ఆరంభం దక్కేలా నిర్వాహకులు ప్లాన్ చేశారు. తొలి మ్యాచ్‌లో కేకేఆర్, ఆర్సీబీ తలపడనుండగా మార్చి 23న మొదటి డబుల్ హెడర్‌లో భాగంగా ఉప్పల్‌లో మధ్యాహ్నం 3:30 గంటలకు హైదరాబాద్ X రాజస్థాన్ తలపడతాయి. అదే రోజు రాత్రి ఐపీఎల్ అభిమానులు 'ఎల్‌క్లాసికో'గా పిలుచుకునే చెన్నైX ముంబై ఢీకొననున్నాయి. ఇక 24న ఢిల్లీX లక్నో, గుజరాత్Xపంజాబ్ తమ టైటిల్ వేటను ప్రారంభించనున్నాయి. చెన్నై, ముంబై మధ్య ఏప్రిల్ 20న రెండో మ్యాచ్ జరుగుతుంది.

### 10 జట్లు.. 2 గ్రూపులు.. 14 మ్యాచ్‌లు

టోర్నీలో పది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-1లో కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ ఉండగా గ్రూప్-2లో సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ ఉన్నాయి. ప్రతి గ్రూపులోని జట్టు.. అదే గ్రూపులోని ఇతర జట్లతో తలా రెండు మ్యాచ్‌లు ఆడనుండగా ప్రత్యర్థి గ్రూపులోని ఉన్న ఒక జట్టు (సీడింగ్ ప్రకారం)తో మినహా మిగిలిన నాలుగు జట్లతో తలా ఒక మ్యాచ్ ఆడుతుంది. ఉదాహరణకు ఎస్‌ఆర్‌హెచ్.. గ్రూప్-1లో కేకేఆర్‌తో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా బెంగళూరు, రాజస్థాన్, చెన్నై, పంజాబ్‌తో ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడనుంది.



**సన్‌రైజర్స్ షెడ్యూల్**

| తేదీ | ప్రత్యర్థి | వేదిక |
|---|---|---|
| మార్చి 23 | రాజస్థాన్ | హైదరాబాద్ |
| మార్చి 27 | లక్నో | హైదరాబాద్ |
| మార్చి 30 | ఢిల్లీ | వైజాగ్ |
| ఏప్రిల్ 03 | కోల్‌కతా | కోల్‌కతా |
| ఏప్రిల్ 06 | గుజరాత్ | హైదరాబాద్ |
| ఏప్రిల్ 12 | పంజాబ్ | హైదరాబాద్ |
| ఏప్రిల్ 17 | ముంబై | ముంబై |
| ఏప్రిల్ 23 | ముంబై | హైదరాబాద్ |
| ఏప్రిల్ 25 | చెన్నై | చెన్నై |
| మే 02 | గుజరాత్ | అహ్మదాబాద్ |
| మే 05 | ఢిల్లీ | హైదరాబాద్ |
| మే 10 | కోల్‌కతా | హైదరాబాద్ |
| మే 13 | బెంగళూరు | బెంగళూరు |
| మే 18 | లక్నో | లక్నో |

**ఐపీఎల్ వేదికలు**

| | | | |
|---|---|---|---|
| 1 | హైదరాబాద్ | 8 | ఢిల్లీ |
| 2 | చెన్నై | 9 | చండీగఢ్ |
| 3 | బెంగళూరు | 10 | కోల్‌కతా |
| 4 | ముంబై | 11 | విశాఖపట్నం |
| 5 | అహ్మదాబాద్ | 12 | ధర్మశాల |
| 6 | జైపూర్ | 13 | గువహతి |
| 7 | లక్నో | | |

## హైదరాబాద్‌లో నాకౌట్ మ్యాచ్‌లు

65 రోజుల పాటు దేశంలోని 13 వేదికలలో 74 మ్యాచ్‌లు (70 లీగ్, 4 ప్లేఆఫ్స్)గా జరుగబోయే ఈ పొట్టి క్రికెట్ సంరంభంలో భాగంగా ఇరు తెలుగు రాష్ర్టాలకు ఈసారి క్రికెట్ మజా రెండింతలు కానుంది. హైదరాబాద్‌లో ఏడు లీగ్ మ్యాచ్ (ఎస్‌ఆర్‌హెచ్)లతో పాటు తొలి క్వాలిఫయర్ (మే 20), ఎలిమినేటర్ (మే 21) మ్యాచ్ (మొత్తం 9)లకూ ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. గత సీజన్ మాదిరిగానే 2025లోనూ ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో రెండు మ్యాచ్‌లు (ఢిల్లీ క్యాపిటల్స్‌కు రెండో హోంగ్రౌండ్) జరుగనున్నాయి. ధర్మశాలలో 3 (పంజాబ్‌కు), గువహతిలో 2 (రాజస్థాన్‌కు) మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ సీజన్‌లో మొత్తం 12 డబుల్ హెడర్స్ ఉన్నాయి.



• **పొలాల్లో భారీ మొసలి**



*వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం కంచిరావుపల్లిలో ఆదివారం మోడెల నరసింహ అనే రైతు వరి చేనులో భారీ మొసలి ప్రత్యక్షమైంది. వనపర్తికి చెందిన సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్ తన సహాయకులతో వచ్చి 12 అడుగుల పొడవు, 370 కిలోల బరువు ఉన్న మొసలిని తాళ్ల సాయంతో బంధించి బీచుపల్లి వద్ద కృష్ణానదిలో వదిలిపెట్టారు. - పెబ్బేరు*

# ఏసీబీ అధికారులమంటూ ఫోన్లతో బురిడీ

- **ప్రభుత్వ అధికారులకు నకిలీ కాల్స్**
- **అప్రమత్తంగా ఉండాలని ఏసీబీ డీజీ హెచ్చరిక**

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఇటీవల తాము ఏసీబీ అధికారులమంటూ లంచాధికారులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో అప్రమత్తమైన ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ స్పందించి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఏసీబీ అధికారుల పేరుతో నకిలీ కాల్స్ చేస్తూ.. ప్రభుత్వ ఉద్యోగులపై కేసులు నమోదు చేయకుండా డబ్బులు డిమాండ్ చేస్తూ.. బెదిరిస్తున్న ఘటనలు తమ దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు. ఎవరైనా ఏసీబీ అధికారుల పేరుతో ప్రభుత్వ అధికారులకు, సామాన్యులకు కాల్ చేస్తే తక్షణం ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని కోరారు. లేదంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎవరైనా అధికారులు లంచాల కోసం పీడిస్తుంటే 1064కు కాల్ చేయాలని, లేదా తమ వాట్సాప్ నంబర్ 9440446106కు, ఫేస్‌బుక్‌లో Telangana ACB, ఎక్స్‌లో @TelanganaACBలో కూడా ఫిర్యాదు చేయొచ్చని, బాధితుల పేరు, వివరాలు గోప్యంగా ఉంటాయని విజయ్‌కుమార్ భరోసా కల్పించారు.

# 56 సబ్‌స్టేషన్లపై ఓవర్‌లోడ్

- **మరో మూడు హైటెన్షన్ లైన్లపైనా..**
- **వేసవి నేపథ్యంలో అధికారుల గుర్తింపు**



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో మొత్తం 378 ఈహెచ్‌టీ(ఎక్స్‌ట్రా హైటెన్షన్) సబ్‌స్టేషన్లు ఉండగా, ఇందులో 56 సబ్‌స్టేషన్లపై ఓవర్‌లోడ్ పడుతున్నది. ఇందుకు కారణం వీటి పరిధిలో అత్యధిక విద్యుత్తు వినియోగమేనని అధికారులు గుర్తించారు. ఇవి ఎక్కువగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉండటం గమనార్హం. వేసవిలో విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో అధికారులు సర్వే నిర్వహించారు. ఓవర్‌లోడ్ సమస్య ఉన్న సబ్‌స్టేషన్లలో 53 సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు 29 సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు పనులు పూర్తవగా, మరో 24 సబ్‌స్టేషన్ల పనులు పురోగతిలో ఉన్నాయి. ఇదిలా ఉండగా మరో 6 హైటెన్షన్ లైన్లలో ఓవర్‌లోడ్ సమస్య తలెత్తింది. వీటిలో మూడు హైటెన్షన్ లైన్ల నిర్మాణం పూర్తవగా, మరో మూడింటి పనులు కొనసాగుతున్నాయి. ఫిబ్రవరిలోనే ఓవర్‌లోడ్ సమస్య ఉంటే, ఇక ఏప్రిల్, మే నెలల్లో మరింత పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# యాక్సిడెంట్లలో టూవీలర్లతోనే మరణాలెక్కువ!

- **రోడ్డు ప్రమాదాల నివేదికలలో కీలక నిజాలు**
- **ప్రాణం తీస్తున్న హెల్మెట్ లేని ప్రయాణాలు**
- **సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం డేంజర్**

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. చాలా ప్రమాదాల్లో నిర్లక్ష్యమే ప్రాణాల మీదకు తీసుకొస్తున్నదని తెలంగాణ రోడ్డుభద్రత నివేదిక-2024 స్పష్టంచేసింది. ఈ నివేదిక ప్రకారం మొత్తం రోడ్డు ప్రమాద మృతుల్లో ద్విచక్ర వాహనదారులే 53 శాతం వరకు ఉన్నారని తెలిపింది. నిరుడు జనవరి నుంచి డిసెంబర్ వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 7,156 మంది ద్విచక్రవాహనదారులు చనిపోయారని పేర్కొంది. అన్ని కేసుల్లోనూ వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు పోయినట్టు నివేదిక స్పష్టంచేసింది. ఆటోలు, లారీలు, ట్రక్కులు, బస్సుల వల్ల 6510 ప్రమాదాలు జరిగినట్టు వెల్లడించింది. జిల్లాల వారీగా చూసుకుంటే సంగారెడ్డి జిల్లాలో గరిష్ఠంగా 895 రోడ్డు ప్రమాదాలు జరిగాయని నివేదిక తెలిపింది.

### కిల్లర్ సెల్‌ఫోన్..

సెల్‌ఫోన్ మాట్లాడుతూ, పాటలు వింటూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగి చాలామంది మృత్యువాతపడుతున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలోనే సెల్‌ఫోన్ డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరమని రవాణా శాఖ అవగాహన కల్పిస్తున్నది. సెల్‌ఫోన్ వినియోగిస్తూ వాహనాలు నడిపితే రూ.1000 జరిమానా విధిస్తున్నది. లైసెన్సులో 2 పాయింట్లను నమోదు చేస్తున్నది. ఈ పాయింట్లు 12కు చేరితే డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తున్నది. కానీ చాలామంది మారడం లేదు. ఈ-డీటెయిల్డ్ యాక్సిడెంట్ రిపోర్ట్, ట్రాఫిక్ పోలీసుల అధ్యయనం ప్రకారం 100 వాహనదారుల్లో 15 మంది సెల్‌ఫోన్లు వాడుతూ వాహనాలు నడుపుతున్నారు. సెల్‌ఫోన్ వాడుతూ వాహనాలు నడపడం వల్ల 2024లో 26 వేల రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 7,700 మంది చనిపోయారు. మరో 20వేల మందికిపైగా గాయాలయ్యాయి.

# ఫిబ్రవరిలోనే ఠారెత్తిస్తున్న ఎండలు

- **పాత రికార్డులను తిరగరాసేలా ఉష్ణోగ్రతలు**
- **మార్చి 15 నుంచి భారీగా పెరిగే అవకాశం**

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : ఫిబ్రవరిలోనే ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఈ వేసవి పాత రికార్డులను తిరగరాసేలా ఉన్నదని వాతావరణ శాఖ అంచనా వేస్తున్నది. మార్చి 15 నుంచి ఉష్ణోగ్రతలు భారీగా పెరుగనున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే తెలంగాణలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వారం రోజుల్లో మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, రామగుండం, ఖమ్మం జిల్లాలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 డిగ్రీలు పెరిగాయి. ఫిబ్రవరిలోనే ఎండలు మండిపోతే.. ఇక ఏప్రిల్, మే నాటికి పరిస్థితి మరింత దారుణంగా ఉండవచ్చని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

### జిల్లాల వారీగా ఉష్ణోగ్రతలు..

రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు 35.7 నుంచి 37.7 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. రాబోయే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. ఖమ్మం జిల్లా రావినూతలలో 37.7 డిగ్రీల గరిష్ఠ, జనగామలో 35.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యాయి. అదేవిధంగా పెద్దపల్లి 37.6, భద్రాద్రి, జగిత్యాల, జోగులాంబగద్వాల తదితర జిల్లాల్లో 37.5 డిగ్రీల చొప్పున నమోదైనట్లు వాతావరణ శాఖ వివరించింది.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.